# సాక్షి
## పశ్చిమగోదావరి

శనివారం । 4 । అక్టోబర్ । 2025






### రూప్‌చంద్ ధర పాతాళానికి

ఏడాదిగా మంచి ధర పలుకుతున్న రూప్‌చంద్ చేపల ధర హఠాత్తుగా పడిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

10లో ▸



### బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు దసరా పండుగ రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి.

10లో ▸



### జిల్లా ఖజానాధికారిగా బేగ్

భీమవరం: జిల్లా ఖజానాధికారిగా మహమ్మద్ మజార్ బేగ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ నాయకులు అభినందించారు.

## న్యూస్‌రీల్

### స్ఫూర్తి ప్రదాత గాంధీజీ



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు టౌన్: మహాత్మాగాంధీజీ ఆశయాలైన సత్యం, అహింస, దేశభక్తి మార్గాల్లో నడవాలని, సత్ప్రవర్తనతో కొత్త జీవితాలు మొదలు పెట్టేందుకు సిద్ధం కావాలని ఖైదీలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి హితవు పలికారు. ఏలూరులోని ఏలూరు వన్‌టౌన్‌లోని జిల్లా కేంద్ర కారాగారంలో గురువారం గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఆమె గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఖైదీలు తమ పాత జీవన విధానాన్ని విడిచిపెట్టి నూతన జీవనం ప్రారంభించాలని ఆకాంక్షించారు. ఎందరో శిక్ష అనుభవించిన అనంతరం మంచిగా మారి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందారన్నారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ జిల్లా జైలులోని ఖైదీలకు ఉచిత న్యాయసహాయం అందిస్తున్నామనీ, బెయిల్ వస్తే ష్యూరిటీ మొత్తం కట్టుకోలేని రిమాండ్ ఖైదీలకు ప్రభుత్వమే ఆ డబ్బులు చెల్లించి విడుదల చేయిస్తున్నామని తెలిపారు. జైలు సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి, జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ప్రతినిధులు కూన కృష్ణారావు, లేళ్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ అబ్బూరి అరుణ, వైద్య అధికారి డాక్టర్ స్వరూప్, న్యాయవాదులు మునేశ్వరరావు, వెంకటేశ్వరరావు, జైలర్లు వి.రమేష్, కె.శ్రీనివాసరావు, కె.వీరవసంతరావు ఉన్నారు.

### కొనసాగిన వైద్యుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

భీమవరం(ప్రకాశం చౌక్): టైమ్ బౌండ్ ప్రమోషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులు పదోన్నతులు లేక ఇబ్బంది పడుతున్నారని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు తమ న్యాయమైన హక్కు అని నినదించారు. పీహెచ్‌సీ వైద్యులు కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను రక్షించారన్నారు. పదోన్నతుల కోసం ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఉద్యమ బాట పట్టామన్నారు. ప్రభుత్వం తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వైద్యాధికారులు కోరారు.

### 'పశ్చిమ'కు స్వచ్ఛాంధ్ర అవార్డులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రస్థాయిలో ఒకటి, జిల్లాస్థాయిలో 49 అవార్డులు గెలుపొందినట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. 17 విభాగాల్లో నిర్వహించిన సర్వేలో అవార్డు గ్రహీతలను ఎంపిక చేశారన్నారు. రాష్ట్రస్థాయిలో బెస్ట్ స్వచ్ఛత వారియర్స్ విభాగంలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలో బొబ్బిలి రామాంజనేయులను ఎంపిక చేశారన్నారు. అలాగే జిల్లాస్థాయిలో బెస్ట్ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్స్, బెస్ట్ స్వచ్ఛత ఎన్జీవోస్, బెస్ట్ స్వచ్ఛత వారియర్స్, స్వచ్ఛ అంగన్‌వాడీలు, బెస్ట్ బస్‌స్టేషన్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ ప్రభుత్వ హాస్పిటల్స్, స్వచ్ఛ వసతి గృహాలు, స్వచ్ఛ పరిశ్రమలు, స్వచ్ఛ మున్సిపాలిటీస్, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ ఎస్‌ఎల్‌ఎఫ్‌ఎస్, స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్ విభాగంలో మొత్తం 49 అవార్డులకు ఎంపికైనట్టు కలెక్టర్ వివరించారు.

### 10న పెన్షన్ అదాలత్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో ఈనెల 10న నిర్వహించనున్న పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పెన్షన్ అదాలత్–ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎట్ యువర్ డిస్ట్రిక్ట్ కార్యక్రమాన్ని జిల్లాల వారీగా చేపట్టామన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామని రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ శాఖల డ్రాయింగ్ ఆఫీసర్లు, పెన్షన్ మంజూరు అధికారులకు మార్గనిర్దేశం, ఉద్యోగులు, పెన్షనర్లకు పెన్షన్ ప్రతిపాదనలపై అవగాహన కల్పించడం, ఫిర్యాదుల పరిష్కారం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు.

## సంబరాల దసరా



భీమవరం (ప్రకాశం చౌక్): మావుళ్లమ్మవారు

దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఊరూవాడా అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా విజయదశమి నాడు అమ్మవార్లు రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



ద్వారకాతిరుమల: కుంకుళ్లమ్మ రథోత్సవం

నూజివీడు: హంసవాహనంపై ఊరేగుతున్న మహిషమ్మవారు

# కొల్లేరులో యథేచ్ఛగా అక్రమ సాగు

- కొల్లేరుపై సీఈసీ నివేదిక ఎప్పుడు ?
- పూర్తి సమాచారం ఇవ్వడంలో ప్రభుత్వ శాఖలు విఫలం
- ఈనెల 8న సుప్రీంకోర్టులో కేసుపై వాదనలు







కైకలూరు మండలం పందిరిపల్లిగూడెంలో సీఈసీ కమిటీ వద్ద గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చిన కొల్లేరు ప్రజలు (ఫైల్), (ఇన్‌సెట్‌లో) సీపీఎం నాయకులకు సమస్యలను వివరిస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కొల్లేరుపై కోర్టుల వివాదాలకు తెరపడటం లేదు. కొల్లేరు అభయారణ్య ఆక్రమణలు, పర్యావరణానికి విఘాతం, ప్రజల ఇబ్బందులు, జిరాయితీ, డీ–ఫాం భూముల అంశాలపై ఈ ఏడాది జూన్ 17, 18 తేదీల్లో సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికారత కమిటీ సభ్యులు జి.భానుమతి, రమన్‌లాల్ భట్, సునీల్ లిమాయే, చంద్రప్రకాష్ గోయల్‌లు పర్యటించారు. సీఈసీ నివేదిక కొల్లేరు ప్రజలకు సానుకూలంగా వస్తుందని కొల్లేరు నాయకులు భావిస్తున్నారు. పర్యావరణ కోణంలో ఆక్రమణ చెరువుల ధ్వంసం చేయడానికి మరో కొల్లేరు ఆపరేషన్‌కు అవకాశం ఉందని పర్యావరణవేత్తలు నమ్ముతున్నారు. ఈనెల 8న సుప్రీంకోర్టులో కొల్లేరు కేసులో వాదనలు జరగనున్నాయి.

**2.25 లక్షల ఎకరాల్లో కొల్లేరు**

ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో 10 కాంటూరు వరకు 2.25 లక్షల ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. అరుదైన చిత్తడి నేలల ప్రాంతంగా కొల్లేరును గుర్తించడంతో పర్యావరణ ప్రేమికులు కొల్లేరులో ఆక్రమణ చెరువులపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో ప్రభుత్వం 120 జీఓను తీసుకొచ్చింది. కొల్లేరులో 5వ కాంటూరు వరకు 77,135 ఎకరాలను అభయారణ్యంగా గుర్తించారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో 31,120 ఎకరాల అక్రమ చెరువులను ధ్వంసం చేశారు. వీటిలోనే 14,932 ఎకరాల జిరాయితీ భూములు, 5,510 ఎకరాల డీ–ఫాం భూములు ఉన్నాయి. వీటిని మినహాయించి అభయారణ్య పరిధిని కుదించాలని కొల్లేరు ప్రజలు కోరుతున్నారు.

**సమాచార పంపిణీలో ప్రభుత్వ శాఖలు విఫలం**

కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణలతో పర్యావరణానికి విఘాతం కలుగుతుందని, సుప్రీంకోర్టు నిబంధనలను పాటించడం లేదని విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి మృత్యుంజయరావు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఫిష్ ఫార్మర్ అసోసియేషన్ తరఫున ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. దీంతో సుప్రీంకోర్టు వాస్తవ పరిస్థితులు అధ్యయనానికి సీఈసీ కమిటీని నియమించింది. కొల్లేరులో జిరాయితీ, డీ–ఫాం భూముల వివరాలు, కొల్లేరు ఆపరేషన్‌కు ముందు జరిగిన పరిణామాలు, పూర్వం కొల్లేరులో రోడ్లు, కొల్లేరు ఆపరేషన్ సమయంలో చెరువులు కోల్పోయిన జిరాయితీ, డీ–ఫాం రైతులకు నష్టపరిహారం ఇటువంటి 16 అంశాలపై ఫారెస్టు, రెవెన్యూ, డ్రెయినేజీ, మత్స్యశాఖ అధికారులను సమాచారం అడిగింది. సీఈసీ కమిటీకి ఆయా శాఖలు పొంతన లేని సమాచారం ఇవ్వడంతో వాటిని తిరిగి పంపింది. ఇటువంటి కారణాలతో సీఈసీ నివేదిక ఆలస్యం అవుతోంది.

### సీఈసీనీ లెక్కచేయక..

సుప్రీంకోర్టు ఆదేశాలతో సీఈసీ కమిటీ సభ్యులు పర్యటించినా కొల్లేరులో అక్రమ చేపల సాగు యథేచ్ఛగా సాగుతోంది. అటవీ శాఖ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేక అక్రమ చేపల చెరువులకు గండ్లు కొట్టామని తప్పుడు సమాచారం ఇచ్చారు. చేపల చెరువులకు చిన్నపాటి గండ్లు పెట్టి ఫొటోలు తీసుకున్న తర్వాత అక్రమ సాగుదారులు వెంటనే గండ్లు పూడ్చేశారు. ఏలూరు జిల్లాలో పలు కొల్లేరు గ్రామాల్లో అటవీ శాఖ గండ్లు పెట్టిన చెరువుల్లో దర్జాగా చేపల సాగు జరుగుతోంది. అక్రమ చెరువులు ధ్వంసం చేయడానికి అటవీ సిబ్బంది గ్రామాల్లోకి వెళుతుంటే కొల్లేరులో కూటమి నేతలు మహిళలను ముందు వరుసలో ఉంచి ఆందోళనలు చేయిస్తున్నారు.

## గాంధీ మార్గం అనుసరణీయం



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని, యువత బాపూజీ స్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, చింతలపాటి బాపిరాజు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ స్వరాజ్యానికి పాటుపడాలి**

బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి అందరూ పాటుపడాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో గాంధీజీ విగ్రహానికి జేసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**22 గ్రామాల్లో రీ సర్వే**

జిల్లాలో 22 గ్రామాల్లో శుక్రవారం నుంచి మూడో విడత రీ సర్వే మొదలు పెట్టినట్టు కలెక్టర్ తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

# హత్య చేసి.. గోనె సంచిలో కుక్కి..

- వీడిన యువకుడి హత్యకేసు మిస్టరీ
- సఖినేటిపల్లిలో సురేష్ మృతదేహం లభ్యం



సఖినేటిపల్లి గోదావరి తీరంలో లభ్యమైన సురేష్ మృతదేహం ఉన్న మూట



మడుగుల సురేష్ (ఫైల్)

తణుకు అర్బన్: తణుకులో మొదట అదృశ్యం.. ఆపై హత్యగా మారి సంచలనం సృష్టించిన కేసులో ఎట్టకేలకు మిస్టరీ వీడింది. చించినాడ గోదావరి తీరంలో పోలీసులు ఈతగాళ్ల సాయంతో చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా ఈనెల 2న తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లిలోని బొడిమెళ్ల గ్రామ పరిధిలో తాడేపల్లిగూడేనికి చెందిన యువకుడు మడుగుల సురేష్ (25) మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. గత నెల 23న తణుకు వెళ్లిన సురేష్ తిరిగి తాడేపల్లిగూడెం రాలేదని న్యాయవాది తిర్రే సత్యనారాయణరాజుపై అనుమానం వ్యక్తం చేస్తూ 25న తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సురేష్ సోదరి శిరీష ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసుగా పోలీసులు నమోదుచేశారు. అయితే పోలీసుల దర్యాప్తులో బయటపడ్డ ఆధారాలతో ముందుగా తణుకు గోస్తనీ కాలువలో, అనంతరం చించినాడ గోదావరిలో రెండురోజులపాటు గాలింపు చేపట్టగా సురేష్ మృతదేహం ఉన్న గోనె సంచి మూట గోదావరిలో లభ్యమైంది. అప్పటికే శవం కుళ్లిపోయి, పురుగులు పట్టిన పరిస్థితుల్లో ఉండగా మృతుడి చేతిపై ఉన్న పచ్చబొట్టుతోపాటు ఒంటిపై ఉన్న దుస్తుల ఆధారంగా బాధిత వర్గాలు గుర్తించిన అనంతరం శుక్రవారం పోలీసులు పంచనామా నిర్వహించి రాజోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు. అనంతరం కుటుంబసభ్యులకు సురేష్ మృతదేహాన్ని అప్పగించారు.

**వివాహేతర సంబంధం వ్యవహారంలో..**

వివాహేతర సంబంధం వ్యవహారంలో న్యాయవాది తిర్రే సత్యనారాయణరాజు పట్టణానికి చెందిన నలుగురు యువకుల సాయంతో గతనెల 23న సురేష్‌పై దాడి చేశారని, దాడి ఘటనలో సురేష్ తలకు తీవ్రగాయమైనట్టు తెలుస్తోంది. మృతి చెందాడని నిర్ధారించుకున్న అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి తణుకు నుంచి ఒక కారులో ఎక్కించుకుని చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలో పారవేసినట్టుగా పోలీసుల దర్యాప్తులో తేలినట్టు సమాచారం. అయితే నిందితులు అంతా ఒకే మాటపై ఉండి మృతదేహం దొరకకుండా ఉండేందుకు పోలీసులకు తప్పుగా సమాచారం ఇస్తూ వారిని ముప్పుతిప్పలు పెట్టారు. సురేష్ సెల్‌ఫోన్‌ను సైతం తాడేపల్లిగూడెంలో పారవేసి పోలీసులను తప్పుదారి పట్టించేందుకు నిందితులు పక్కా ప్లాన్ చేశారని సమాచారం. అయినా పోలీసులు తమదైన రీతిలో విచారణ చేసి చివరకు పదో రోజున మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం లభ్యం కాని పక్షంలో కేసు వీగిపోతుందనే ఉద్దేశంతో నిందితులు చాకచక్యంగా వ్యవహరించినా చివరకు మిస్టరీ వీడిందని, అయితే మృతదేహం తరలింపులో నిందితులు విని యోగించిన కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

### ప్రతిష్టాత్మకంగా తీసుకుని..

యువకుడి అదృశ్యం ఘటన గతనెల 25 నుంచి ప్రసార సాధనాలు, సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తున్న నేపథ్యంలో తణుకు పోలీసులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.తణుకు పట్టణ స్టేషన్‌లో ఇద్దరు ఎస్సైలు, కానిస్టేబుళ్లు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ బందోబస్తుకు వెళ్లిన నేపథ్యంలో స్టేషన్‌లో సగం సిబ్బంది కూడా లేని పరిస్థితి. అయినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తణుకు సీఐ ఎన్.కొండయ్య నేర విభాగ పోలీసుల సహకారంతో కేసును ఛేదించారు. అలాగే గతనెల 27న తణుకు వారణాసి వారి వీధిలో వృద్ధురాలిని భయపెట్టి 70 కాసుల బంగారు ఆభరణాల చోరీ కేసులో సైతం పురోగతి లభించినట్టు తెలిసింది. అనుమానితులను గుర్తించి, మహారాష్ట్రకు ప్రత్యేక నేర విభాగం సిబ్బంది వెళ్లి నిందితులను పట్టుకున్నట్టు సమాచారం. చోరీకి సంబంధించిన సొత్తును సైతం సేకరిస్తున్నట్టు తెలుస్తోంది.

# ఎరువు.. దరువు

- రైతులపై ముప్పేట దాడి
- ధరల పెరుగుదలతో అన్నదాతలు సతమతం
- పట్టించుకోని కూటమి సర్కారు
- జిల్లాలో 4.70 లక్షల ఎకరాల్లో సాగు



ఎరువుల బస్తాలు

ఏలూరు (మెట్రో): ఎరువుల ధరలు పెరుగుదలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే యూరియా కొరతతో అవస్థలు పడుతున్న రైతుల నెత్తిన ఎరువుల ధరల పెరుగుదల మరో పిడుగులా మారింది. ఓ పక్క ధరల పెరుగుదల, మరోపక్క దుకాణాల్లో ఎమ్మార్పీకి మించి విక్రయించడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జీఎస్టీ తగ్గింపుతో కారులు, ద్విచక్రవాహనాలు, గృహోపకరణాలు తదితర వస్తువుల ధరలు తగ్గినా రైతులకు అవసరమయ్యే ఎరువుల ధరలు మాత్రం తగ్గలేదు. రైతే దేశానికి వెన్నెముక అని చెబుతున్నా అన్నదాతల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

**ఎరువులు వాడాల్సిన పరిస్థితి**


ఏలూరు జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న ప్రధాన పంటలు కాగా వేరుశనగ, పెసర, మినుము పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

జిల్లాలో వ్యవసాయ సాగు 1,97985 ఎకరాలు ఉండగా, ఉద్యాన పంటల సాగు 2,72,939 ఎకరాలు ఉంది. ఉద్యాన పంటల్లో ప్రధానంగా ఆయిల్‌పామ్, కోకో, కొబ్బరి సాగవుతున్నాయి. ప్రస్తుతం పంటలపై వస్తున్న చీడపీడలను తట్టుకునేందుకు, దిగుబడులు వచ్చేందుకు రైతులు తప్పనిసరిగా ఎరువులపై ఆధార పడాల్సిన పరిస్థితి. అయితే ధరల పెరుగుదల వారికి భారంగా మారింది. దుకాణాల్లో ఎమ్మార్పీకి అదనంగా విక్రయించడం మరింత ఇబ్బంది పెడుతోంది. ఎరువుల ధరల నియంత్రణ, ఎమ్మార్పీకి విక్రయించేలా చర్యలు తీసుకోవడంలో కూటమి సర్కారు విఫలమైందని రైతులు అంటున్నారు.

**ధరలు (బస్తా రూ.లలో)**

| ఎరువు రకం | గతం | ప్రస్తుతం |
|---|---|---|
| 20-20-0 | 1,250 | 1,350 |
| 10-26-26 | 1,470 | 1,850 |
| 15-15-15 | 1,450 | 1,650 |
| 14-15-14 | 1,700 | 1,850 |
| పొటాష్ | 1,550 | 1,800 |
| 28-28 | 1,700 | 1,850 |
| 20-20-0-13 | 1,300 | 1,450 |
| 24-24 | 1,700 | 1,850 |

### ధరలను నియంత్రించాలి




సాగు చేయాలంటేనే ఎరువుల ధరలు భయపెడుతున్నాయి. వీటిపై నియంత్రణ లేకపోతే ఏటా పెట్టుబడులు పెరిగిపోతాయి. రైతులు పండించిన పంటలకు మాత్రం గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎరువుల ధరలను నియంత్రణలో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– రావూరి రవి, రైతు, బాపిరాజుగూడెం

### గత ప్రభుత్వంలో పటిష్ట చర్యలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులను సరఫరా చేసి ధరల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ధరలపై పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా చూసేవారు. యూరియాను సైతం గ్రామాల్లోనే అందుబాటులో ఉంచేవారు. అయితే కూటమి సర్కారులో రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు.

# ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి



సమీక్షిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు అధికారులు సన్నద్ధం కావాలని, మిల్లర్ల నుంచి నాణ్యమైన గోనె సంచులను సేకరించి రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణ, రీ సర్వే, జీఎస్టీ, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్, ఇళ్ల స్థలాలు తదితర అంశాల ప్రగతిపై మండలాల వారీగా డీఆర్వో, ఆర్డీఓ, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వాణిజ్య, వ్యవసాయ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, వివాదాలకు తావులేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. రీ సర్వేకు సంబంధించి గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీఓ దాసి రాజు, వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**జీఎస్టీ అమ్మకాలపై ఆరా**

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక జువ్వలపాలెం రోడ్డులోని సోనోవిజన్ షోరూమ్‌ను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ మేరకు అమ్మకాలు జరపాలని ఆదేశించారు. దుకాణదారులు జీఎస్టీ తగ్గించకుంటే వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాణిజ్య పన్నుల శాఖ డీసీ కేపీ శైలజ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వి.కేదారేశ్వరరావు ఉన్నారు.

# రూప్‌చంద్ ధర పాతాళానికి

- నష్టాల ఊబిలో రైతులు
- సంక్షోభంలో రూప్‌చంద్ సాగు
- కిలో రూ.82కు పడిపోయిన ధర



**గణపవరం:** ఏడాది కాలంగా మంచి ధర పలుకుతున్న రూప్‌చంద్ ధర హఠాత్తుగా పడిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రెండు నెలల వ్యవధిలోనే కిలోపై రూ.30 మేర పడిపోగా, గత జనవరితో పోలిస్తే ఏకంగా కిలోకి రూ.45 వరకూ తగ్గిపోయింది. దీంతో రూప్‌చంద్ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుత ధర కిలో రూ.82కు అమ్మితే కనీసం పెట్టుబడులు సైతం దక్కవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర పెరుగుతుందన్న ఆశతో రైతులు పట్టుబడికి వచ్చిన చేపలను చెరువులలోనే ఉంచి రోజుల తరబడి మేపుతున్నారు.

### తగ్గిన రూప్‌చంద్ ఎగుమతులు

ధర పడిపోవడంతో రైతులు పట్టుబడులు నిలిపివేశారు. దసరా తర్వాతైనా ధర పెరుగుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. జిల్లా నుంచి రోజూ సుమారు 30 నుంచి 40 లారీల రూప్‌చంద్ చేపల ఎగుమతులు జరిగేవి. ప్రస్తుతం రోజుకు 15 లారీలకు మించి జరగడంలేదని చెబుతున్నారు. గత జూలై వరకూ కిలో రూ.112 నుంచి రూ.115 వరకూ పలికిన ధర క్రమంగా తగ్గుతూ వారం రోజుల్లో కిలో రూ.82కు పడిపోయింది.

### ఎకరాకు లక్ష రూపాయల నష్టం

రూప్‌చంద్ ధర అమాంతం పడిపోవడంతో రూప్‌చంద్ సాగుచేసిన రైతులు లబోదిబోమంటున్నారు. కరోనా సమయంలో తప్ప ఇంతటి గడ్డు పరిస్థితి ఎప్పుడూ చూడలేదని రైతులంటున్నారు. ప్రస్తుత ధరకు రూప్‌చంద్ అమ్మితే ఎకరాకు రూ.లక్ష వరకూ నష్టపోవాల్సి వస్తుందంటున్నారు. ఈ ధర ఇంకా తగ్గే అవకాశం ఉందన్న ప్రచారంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత చెరువుల నిర్వహణ రీత్యా రూప్‌చంద్ ధర కనీసం కిలో రూ.95 ఉంటే పెట్టుబడులతో బయటపడతామని, ఈ ధరకు ఎంత తక్కువకు అమ్మితే ఆ మేరకు నష్టం తప్పదని రైతులు చెబుతున్నారు. ఏడాదిన్నర కాలంగా రూప్‌చంద్ ధర బాగుండటంతో రైతులు ఎక్కువ మంది రూప్‌చంద్ సాగులోకి దిగారు. కిలో రూ.110 దాటని ధర ఏడాది కాలంగా పెరుగుతూ కిలో రూ.127 వరకూ పెరిగింది. దీంతో చాలామంది రైతులు లాభపడ్డారు. ఏడాది కాలంగా ఈ ధర నిలకడగా ఉండటంతో ధర బాగుందన్న ఉద్దేశ్యంతో గత అక్టోబర్, నవంబర్ నెలల్లో చాలామంది రూప్‌చంద్ సాగు చేపట్టారు. అప్పట్లో రొయ్యసాగు చేసి తీవ్రంగా నష్టపోయిన చాలామంది రైతులు రూప్‌చంద్ సాగు చేపట్టారు. దీంతో రూప్‌చంద్ సాగు విస్తీర్ణం తెల్లచేపను మించిపోయింది.

### పట్టుబడి సమయానికి పడిపోతున్న ధర

ప్రస్తుతం రూప్‌చంద్ పట్టుబడులకు సిద్ధంగా ఉంది. ఈ సమయానికి చేప ధర దారుణంగా తగ్గిపోవడంతో రైతుల పరిస్థితి అయోమయంగా తయారైంది. సరిగా పట్టుబడి సమయానికి ధర తగ్గిపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. రెండేళ్ల క్రితం కూడా ఇదే విధంగా రూప్‌చంద్ ఎక్కువ విస్తీర్ణంలో పట్టుబడికి వచ్చిన సందర్భంగా చేప ధర కిలో రూ.60కు పడిపోయి రైతులు దారుణంగా నష్టపోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.25 లక్షల ఎకరాలలో ఆక్వాసాగు జరుగుతుండగా, సుమారు 1.30 లక్షల ఎకరాలలో చేపల సాగు చేస్తున్నారు.

### రాబడి మేతలకే సరి

ప్రస్తుత ధరలో చేపను అమ్మితే వచ్చే సొమ్ము మేత ఖర్చులకే సరిపోతుందని, చెరువు లీజులు, సీడ్, మందులు, విద్యుత్ బిల్లులు, కాపలాదారుల ఖర్చు, నిర్వహణ వ్యయం రైతు భరించక తప్పదని వాపోతున్నారు. ఇవన్నీ కలిపితే ఎకరాకు కనీసం రూ.లక్ష వరకూ నష్టం వస్తుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొంతకాలం వేచి చూస్తే చేప ధర పెరుగుతుందన్న ఆశతో రోజుల తరబడి చేపలను చెరువులో ఉంచి మేపడం వల్ల మరింత నష్టం తప్పడం లేదని వాపోతున్నారు.

### దళారులదే రాజ్యం



ఆక్వా రంగంలో దళారులు, వ్యాపారులదే రాజ్యం. ప్రభుత్వ కనీస ధరలు నిర్ణయించినా అమలుకు నోచుకోవడం లేదు. నేను 27 ఎకరాలలో రూప్‌చంద్ సాగుచేస్తున్నాను. ప్రస్తుతం చేపలు పట్టుబడికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సమయంలో ధర కిలో రూ.82కు పడిపోవడంతో ఏంచేయాలో పాలుపోవడంలేదు. ఈ ధరలో అమ్మితే రైతులకు పెట్టుబడి కూడా దక్కే పరిస్థితిలేదు. దీనికి తోడు ఆక్వాచెర్వులపై ఎడాపెడా విద్యుత్ బిల్లుల మోత మోగుతుంది.

– సంకు శ్రీనివాసరావు, రైతు

### ఆక్వా సాగు చేయలేం



ఏడాదిన్నరగా చేపల సాగు నష్టాలతో నడుస్తుంది. వ్యాపారులు ధర తగ్గించేయడం, కంపెనీలు మేత ధర పెంచేయడంతో రైతులు నలిగిపోతున్నారు. ఇటీవల పది ఎకరాలలో రూప్‌చంద్ సాగుచేసి పది లక్షలు నష్టపోయాను. కొంత కాలంగా రూప్‌చంద్ ధర బాగుండటంతో మళ్లీ 20 ఎకరాలలో రూప్‌చంద్ వేశాను. ప్రస్తుతం పట్టుబడి దశకు చేరింది. గత నెలలో మిడిల్ క్రాప్ తీస్తే కిలోలోపు సైజుకు రేటు రూ.90 వచ్చింది. ఇప్పుడు కిలోసైజు చేపధర రూ.80కు పడిపోయింది.

– రమేష్‌రాజు, ఆక్వా రైతు

### ఇంత గడ్డు పరిస్థితి చూడలేదు



చేపల సాగు నష్టాలలో నడుస్తుండటంతో ఆ ప్రభావం సీడ్, చేప పిల్లపై పడింది. రూప్‌చంద్‌కు ధర లేకపోవడంతో మూడేళ్లుగా చేప పిల్లల వ్యాపారం నష్టాలలో నడుస్తుంది. గతంలో ఐదు అంగుళాల సైజు ఉన్న రూప్‌చంద్ చేపపిల్ల ధర రూ.9 పలికేది. రూప్‌చంద్ ధర పడిపోవడంతో సాగు తగ్గిపోతుంది. ప్రస్తుతం రూప్‌చంద్ సీడ్ కొనే నాథుడు కనిపించడంలేదు.

– సమయం వీరరాఘవులు, రూప్‌చంద్ పిల్ల పెంపకందారు

# బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం

- తొలిరోజు వరుడైన శ్రీవారు
- రెండో రోజు నేత్రపర్వంగా ధ్వజారోహణం
- ప్రత్యేక అలంకారాల్లో స్వామివారి దర్శనం



శ్రీవారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేస్తున్న అర్చకులు

**ద్వారకాతిరుమల:** శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు దసరా పండుగ రోజు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేయు వేడుక వైభవంగా జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులను ఆలయం నుంచి తొళక్క వాహనంపై తీసుకెళ్లి, నిత్యకల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వేంచేపు చేశారు. ఆ తరువాత అర్చకులు సర్వాభరణ భూషితులైన శ్రీవారు, అమ్మవార్లకు బుగ్గన చుక్క, కల్యాణ తిలకాలను దిద్దారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భద్రాజీ, ఏఈఓ పి.నటరాజారావులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, పూలు, పండ్లను సమర్పించారు. ఆ తరువాత పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేసే వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ఆఖరిలో అర్చకులు, పండితులకు అధికారులు నూతన వస్త్రాలను అందజేశారు. తొలిరోజు స్వామివారు ఆలయ ముఖ మండపంలో శ్రీ మహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

**చరాచర సృష్టికి ఆహ్వానం..**

బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు శుక్రవారం రాత్రి ఆలయంలో ధ్వజారోహణ వేడుక వైభవంగా జరిగింది. ఉత్సవాలకు ఇంద్రాది అష్టదిక్పాలకులను, సర్వ దేవతలను, గంధర్వ, కిన్నెర, కింపురుషాది దేవగణాలను, సప్త అధోలోక జీవులను స్వాగతిస్తూ వేద మంత్రోచ్ఛరణలతో అర్చకులు ఆలయ ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఆ తరువాత గరుడ ప్రసాదాన్ని భక్తులకు, సంతానం లేని మహిళలకు అందించారు. అంతకు ముందు రుత్విగ్వరణ, మృద్గ్రహణ, అంకురార్పణ కార్యక్రమాలను జరిపారు. అంకురార్పణలో భాగంగా ఆలయ యాగశాలలో ఏర్పాటు చేసిన పాలికల్లో అర్చకులు పుట్టమన్నును ఉంచారు. ఆ తరువాత వాటిలో నవధాన్యాలను పోసి అంకురార్పణను నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ ముఖ మండపంలో స్వామివారు మురళీ కృష్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



తొలిరోజు మహావిష్ణువు అలంకారంలో శ్రీవారు



రెండోరోజు మురళీకృష్ణ అలంకారంలో

### బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం
- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 9 గంటల నుంచి భక్తిరంజని
- ఉదయం 10 గంటల నుంచి కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వరకచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు.
- రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవం
- ప్రత్యేక అలంకారం : సరస్వతి



ధ్వజపటానికి హారతులిస్తున్న అర్చకులు

### గజలక్ష్మి భయపెట్టింది



**ద్వారకాతిరుమల:** శ్రీవారి గ్రామోత్సవం జరుగుతున్న సమయంలో గుర్రం దగ్గరకు వెళ్లడంతో దాని నీడ చూసి భయపడిన దేవస్థానం ఏనుగు గజలక్ష్మి ఒక్కసారిగా అడ్డం తిరిగింది. దాంతో వాద్యకారులు, భక్తులు భయంతో రోడ్డుపై పరుగులు తీశారు. దేవస్థానం ఆటోను అడ్డు పెట్టడంతో గజలక్ష్మి నిలిచిపోయింది. దాంతో అక్కడున్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు. శ్రీవారు ఉభయ దేవేరులతో కలసి సెమీ పూజ నిమిత్తం దసరా మండపం వద్దకు గురువారం రాత్రి తరలి వెళుతున్నారు. గుడి సెంటర్ దాటిన తరువాత అశ్వం దగ్గరకు వెళ్లడంతో దాని నీడను చూసి గజలక్ష్మి కంగారుపడింది.

# జంగారెడ్డిగూడెంలో దారుణ హత్య





హత్యకు గురైన కర్రి రాజేష్

**జంగారెడ్డిగూడెం:** పాత కక్షల నేపథ్యంలో పాత నేరస్తుడిని మరికొంతమంది పాత నేరస్తులు కలిసి హత్య చేశారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. స్థానిక ఉప్పలమెట్టపై నివశిస్తున్న కర్రి రాజేష్ (25)ను శుక్రవారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు పిలవగా, వారిని చూసి రాజేష్ పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో అతన్ని వెంబడించి బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లి కాళ్లు చేతులు కట్టేసి స్థానిక బైనేరు వాగు ఒడ్డున కత్తితో హత్య చేశారు. అతని భార్య నాగేశ్వరి మాట్లాడుతూ తన భర్త రాజేష్ ఇంట్లో ఉండగా, ఖాసిం, చోటులు వచ్చారని, వారిని చూసి రాజేష్ పారిపోగా, అతన్ని వెంబడించారని, అలాగే రెండు బైక్‌లపై వచ్చిన మరో ఇద్దరు, ముగ్గురు కూడా వెంబడించారన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై షేక్ జబీర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కర్రి రాజేష్, షేక్ ఖాసిం, షేక్ నాగుల్‌మీరా, సంపంగి మంగరాజు, వాసంశెట్టి రామచంద్రపవన్, షేక్ జహీరుద్దీన్ అలియాస్ చోటు కలిసి దొంగతనాలు చేసేవారు. రాజేష్, షేక్ ఖాసింపై జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్‌లున్నాయి. వీరిపై జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, తెలంగాణ రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్‌లలో పలు దొంగతనాల కేసులు ఉన్నాయి. దొంగతనాలకు సంబంధించి పంపకాల విషయంలో తేడా వచ్చిందని, వరంగల్ జిల్లాలో దొంగతనానికి సంబంధించి కర్రి రాజేష్, మిగిలిన వారి పేర్లు చెప్పాడనే కక్షతో ఈ హత్యకు పాల్పడినట్లు తెలిసింది. సుమారు నెల రోజులుగా రాజేష్‌ను హతమార్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి నాటిక పోటీల్లో బహుమతి



అవార్డు అందుకుంటున్న తాళాబత్తుల వేంకటేశ్వరరావు

**పాలకొల్లు సెంట్రల్:** పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించి నటించిన భువికోరని భ్రమణం నాటిక తృతీయ బహుమతి గెలుచుకుంది. తెనాలి రామకృష్ణ కళాక్షేత్రంలో సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 2 వరకూ జరిగిన జాతీయస్థాయి సాంఘిక నాటిక పోటీల్లో ఈ బహుమతి గెలుచుకున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో తనకు బహుమతి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

### శ్రీవారి దేవస్థానం క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



శ్రీవారి దేవస్థానం నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఆలయ ఏఈఓ రమణరాజు, సూపరింటెండెంట్ కిషోర్

**ద్వారకాతిరుమల:** శ్రీవారి దేవస్థానం 2026 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆలయ ఏఈఓ రమణరాజు, సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్‌లు శుక్రవారం ఆవిష్కరించారు. సింగిల్ పేజీ క్యాలెండర్ ధర రూ.35, డైరీ ధర రూ. 120గా దేవస్థానం నిర్ణయించింది. వీటిని ఆలయ అనివేటి మండపంలో ఉన్న ఫొటో స్టాల్‌లో భక్తులకు అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

### కాలువలో వృద్ధురాలి గల్లంతు

**ముదినేపల్లి రూరల్:** కాలువలో వృద్ధురాలు గల్లంతు కాగా స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ముదినేపల్లికి చెందిన వీరంకి విమల(65) భర్త సాంబయ్య ఇటీవలే చనిపోయాడు. అప్పటినుంచి మానసికంగా కృంగిపోయిన విమల తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోతుండగా కుటుంబసభ్యులు వెనక్కి తీసుకొస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున విమల ఇంట్లో కనిపించకుండా పోయింది. కుటుంబసభ్యులు గాలించగా స్థానిక పోల్‌రాజ్ కాలువలో దిగి స్నానం చేస్తూ కొట్టుకుపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయినట్లు కాలువ సమీపంలోని వ్యక్తులు తెలిపారు. దీనిపై విమల కుమార్తె పరసా గాయత్రీ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మృతురాలి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఆంధ్రా సుగర్స్‌లో విజయ దశమి వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

**తణుకు అర్బన్:** విజయదశమిని పురస్కరించుకుని వెంకటరాయపురంలోని ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ సంస్థలో దసరా వేడుకలు నిర్వహించారు. సంస్థ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య మాట్లాడుతూ తమ సంస్థ 500 టన్నుల సామర్థ్యంతో ప్రారంభించి 10 వేల టన్నుల సామర్థ్యం వరకు పురోగమించిందని స్పష్టం చేశారు. కలెక్టర్ సీహెచ్.నాగరాణి మాట్లాడుతూ డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ గ్రామీణ ప్రాంతాల్లో కర్మాగారాన్ని స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పించి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీమన్నారాయణమూర్తి, సంస్థ అడిషనల్ సెక్రటరీ పీవీఎస్ విశ్వనాథకుమార్, జీఎం ఎ.సాంబశివరావు, ఏజీఎం పి.శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఎరుపెక్కిన శ్రీవారి క్షేత్రం



శ్రీవారి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భవానీ దీక్షాధారులు

**ద్వారకాతిరుమల:** శ్రీవారి దివ్య క్షేత్రం శుక్రవారం భవానీ దీక్షాదారులతో ఎరుపెక్కింది. దేవీ శరన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో దీక్షలు విరమించిన భక్తులంతా ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకుంటున్నారు. దాంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ పరిసరాలు భవానీలు, సాధారణ భక్తులతో కిక్కిరిశాయి. దర్శనం క్యూలైన్లు, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, పరిసర ప్రాంతాలు, కల్యాణకట్ట తదితర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. కొండపై ఎక్కడ చూసినా భవానీ దీక్షాధారులే కనిపించారు.

### జీవో నిలుపుదలపై హర్షం

**ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్**



**తణుకు అర్బన్:** ఆంధ్ర ప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తిన దొమ్మరి కుల పేరును, దొమ్మరి (గిరి బలిజ) గా మార్పు చేసిన అంశంపై అభ్యంతరం వ్యక్తం చేసిన సందర్భంలో ఆ జీవోను నిలుపుదలచేస్తూ ఆదేశాలు జారీచేయడం మంచి పరిణామమని మండలి సభ్యుడు వంక రవీంద్ర నాథ్ అన్నారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో బలిజ (కాపు) వర్గాల్లో అలజడి మొదలై అనేక జిల్లాలు, మండలాల్లో ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు అందచేశారని అన్నారు.

### తగ్గుతున్న గోదావరి వరద

**పోలవరం రూరల్:** గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి చేరే నీరు క్రమేపీ తగ్గుతుండటంతో వరద ఉధృతి తగ్గుతూ ప్రవహిస్తోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 31.720 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి 8 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద కూడా వరద బాగా తగ్గింది. 36.90 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

### వైద్యుల డిమాండ్లు పరిష్కరించాలి

**వేలేరుపాడు:** ఏజెన్సీ ప్రాంతంలో సేవలందిస్తున్న వైద్యుల డిమాండ్లు పరిష్కరించాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడియం సువర్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ గత నెల 25 నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యులకు ఇన్ సర్వీస్‌లో ఉన్న వారికి పీజీ కోటా సీట్లు క్లినికల్ 30 శాతం నుంచి 15 శాతం, నాన్ క్లినికల్ కోటాలో 50 శాతం నుంచి 30 శాతం వరకు తగ్గించారన్నారు.

### గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

**పెదవేగి:** పెదవేగి మండలం ముందూరు శివారులోని పోలవరం కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం గుర్తించారు. వెంటనే పెదవేగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పెదవేగి ఎస్సై రామకృష్ణ మృతదేహాన్ని వెలికి తీయించారు. ఆమె వయసు 60 నుంచి 70 సంవత్సరాలు మధ్య ఉంటుందని వివరాలు తెలిసినవారు పెదవేగి ఎస్సై 9440796638 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.



### చీటీల పేరుతో మోసం



నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

**నూజివీడు:** నూజివీడులోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన శిరిగిరి వెంకటేశ్వరరావు అలియాస్ మోషే చీటీ పాటల పేరుతో 52 మంది నుంచి రూ.2.50 కోట్లు వసూలు చేసి మోసం చేశాడని పేర్కొంటూ బాధితులు శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నూజివీడుతో పాటు హనుమాన్‌జంక్షన్, ధర్మాజీగూడెం, బంటుమిల్లి, పెడన, చిల్లకల్లు, ప్రగడవరం, కుక్కునూరు, రామాపురం, కొత్తపల్లి గ్రామస్తుల దగ్గర బుడజంగాల సెక్రటరీ అంటూ మాయమాటలు చెప్పి చీటీపాటల పేరుతో మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను నమ్మించి మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. చీటీ పాటలు కడితే అవసరానికి ఉపయోగపడతాయని చెప్పి ఈ విధంగా మోసం చేయడం దారుణమని, అతనికి నూజివీడులో రెండు బట్టల షాపులున్నాయని, మూడు ఇల్లు కట్టించాడని, ఇతర ఆస్తులున్నాయని, బంధువుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఐపీ నోటీసులు ఇచ్చాడని పేర్కొన్నారు.


### రేషన్ బియ్యం పట్టివేత

**చాట్రాయి:** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సివిల్ సప్లయిస్ డీటీ వెంకటేశ్వరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన ధనికొండ గోపిరాజు, కోట సురేష్ బాబు, తిరువూరుకు చెందిన చారి రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి మండలంలోని గుడిపాడు నుంచి చనుబండ మీదుగా తిరువూరు తరలిస్తుండగా 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఆయన చెప్పారు.

### వైఎస్సార్‌సీపీ ఈసీ సభ్యులుగా నియామకం



పీడీ రాజు



పెండ్ర వీరన్న

**నరసాపురం:** వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఇద్దరు నేతలను నియమించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో సీనియర్ నేత పీడీరాజు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్నను నియమించారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని పదవులు పొందిన నేతలు తెలిపారు.

**వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ మెంబర్ల నియామకం**

**ఏలూరు టౌన్:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు నేతలను ఎస్‌ఈసీ సభ్యులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీవీ రావు, గొర్రుముచ్చు గోపాల్ యాదవ్‌ను ఎస్‌ఈసీ సభ్యులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**జిల్లా నాయకులకు పదవులు**

**భీమవరం:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్‌ఈసీ) మెంబర్లుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) (ఉండి), మంతెన యోగీంద్రబాబు (ఉండి), మేడిది జాన్సన్ (భీమవరం), కొట్టు నాగేంద్ర (తాడేపల్లిగూడెం), చీర్ల రాధయ్య (తణుకు) నియమితులయ్యారు.

### కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య

**కొయ్యలగూడెం:** కొయ్యలగూడెం పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. అంకాలగూడెంకు చెందిన కేవీ సతీష్ పురుగుల మందు తాగడంతో రాజమండ్రి ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించి చికిత్స కొనసాగించారు. మళ్లీ జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్‌కి శుక్రవారం తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



తణుకు సజ్జాపురంలో కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ దంపతులు

**తణుకు అర్బన్:** దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సజ్జాపురంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలోని కనకదుర్గమ్మను ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, మునిసిపల్ మాజీ చైర్పర్సన్ వంక రాజకుమారి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మీసాల నాగేశ్వరరావు, దయ్యాల సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

**నాగమ్మ తల్లి ఆలయంలో..**

స్థానిక జాతీయ రహదారి సమీపంలో శ్రీచక్రసహిత నాగదుర్గాదేవి (నాగమ్మ) ఆలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమ్మ తల్లి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### ఎరువుల దుకాణాల తనిఖీలు



అత్తిలిలో ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ డీఎస్పీ

**అత్తిలి:** ఎరువుల డీలర్లు విక్రయాలకు సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంట్ డీఎస్పీ ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం అత్తిలి గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, లక్ష్మి వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా ఎరువుల నిల్వలను, ఈ పాస్‌నిల్వలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎస్సై కే సీతారాము, వ్యవసాయాధికార టీకే. రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తపరీక్షలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కడకట్ల జనతా ఆసుపత్రి ఆవరణలో క్లబ్ అధ్యక్షుడు చిన్నం మణీంద్ర ఆధ్వర్యంలో మెగా ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం జరిగింది. మాజీ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు ఆర్థిక సహకారం అందించారు. డాక్టర్ లక్ష్మీపతి రాజు శిబిరాన్ని ప్రారంభించారు. 110 మంది రోగులకు రక్త పరీక్షలు జరిగాయి. పేరూరి కాశయ్య, వంగపండు రామ్మోహన్‌రావు, పడాల మహేశ్వరరావు, డాక్టర్ ఎల్ఎస్‌పీ నాగేశ్వరరావు, ఆంజనేయస్వామి, క్లబ్ సెక్రటరీ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయంలోని అమ్మవారిని గురువారం రాత్రి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సమీప కాలువలో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

### పడాలలో మినీ గోకులానికి శంకుస్థాపన



పడాలలో మినీ గోకులానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని పడాల గ్రామంలో నిర్మించనున్న మినీ గోకులానికి శుక్రవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో మరో 100 గోకులాలు నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరితగతిన షెడ్లు నిర్మిస్తే బిల్లులు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ఎం.వెంకటేష్, పంచాయతీ శ్రీనివాస్, కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వేతనాల కోసం కార్మికుల వెతలు

- 3 నెలలుగా జీతాలందక యాతన పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు
- అసలే అరకొర వేతనం..



రేలంగి పంచాయతీ కార్యాలయం

**ఇరగవరం:** మండలంలోని రేలంగి పంచాయితీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఆకలి కేకలతో అల్లాడుతున్నారు. 3నెలలుగా వారికి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇళ్లు గడపలేకపోతున్నామని వాపోతున్నారు. రేలంగిలో 2011 జనాభా లెక్కల ప్రకారం 14,559 మంది జనాభా ఉండగా ఇప్పుడు సుమారు 20వేల మంది జనాభా ఉన్నారు. దీంతో వారి అవసరాలు పెరిగాయి. రేలంగి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్తను డంపింగ్ యార్డులకు చేరవేయడం కోసం 22మంది శానిటేషన్, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. ఇద్దరికి ఒక వాహనం చొప్పున 11చెత్త సేకరించే వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులు రెండు నుంచి నాలుగు సార్లు చెత్తను పోగు చేసి డంపింగ్ యార్డులకు చేరవేయాల్సి ఉంటుంది. ఒక్క రోజు పారిశుద్ధ్య కార్మికులు పని చేయకపోతే ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయి డ్రెయినేజీలు, రోడ్లు, చెత్తతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతాయి. అలాంటి పారిశుద్ధ్య కార్మికులకు అధికారులు వేతనాలు పెండింగ్‌లో పెట్టడంతో అప్పులు చేసుకొని ఇళ్లు గడపాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా ఈ విషయంపై ఆందోళన చేస్తే అధికారులు, నాయకులు ఎలా స్పందిస్తారో తెలియక, ఒక వేళ బహిరంగంగా వస్తే వారిని పని నుంచి తొలగించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తారన్న భయంతో ఎవరూ బయటకు రావడం లేదు. ఇప్పటికైనాఅధికారులు స్పందించి శానిటేషన్, పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన వేతనాలు ఇప్పించాలని కోరుతున్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



రేలంగి గ్రామంలో పని చేస్తున్న శానిటేషన్, పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలి లేని పక్షంలో ఆందోళన చేపతాం. రోజు గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతూ, ప్రజలను రోగాల బారి నుంచి కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలి. అధికారులు వెంటనే స్పందించాలి.

– ఇల్లిందలపర్తి సత్యనారాయణ, సీపీఎం పార్టీ రేలంగి కార్యదర్శి

### వేతనాలు చెల్లిస్తాం



గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి ప్రమోషన్‌తో రేలంగి నుంచి వెళ్లడం జరిగింది. ఆయన తర్వాత చార్జీ ఇవ్వకుండా చాలా రోజులు అధికారులను ఇబ్బంది పెట్టారు. దీంతో స్పందించి అతనికి నోటీసులు ఇచ్చాం. ఈ విషయాన్ని జిల్లా అధికారులు దృష్టిలో పెట్టాం. ప్రస్తుతం కావలిపురం కార్యదర్శికి ఇంచార్జీ ఇచ్చాం. త్వరలోనే వారికి జీతాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

– ఎ.శ్రీనివాస్, ఇరగవరం, ఎంపీడీవో

# ఘనంగా కారుమూరి పుట్టినరోజు వేడుకలు



కేకు కట్‌చేస్తున్న పార్టీ నాయకులు



కేకు కట్‌చేస్తున్న కొట్టు నాగేంద్ర, పార్టీ శ్రేణులు

**తణుకు అర్బన్:** మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కారుమూరి సునీల్‌కుమార్‌ల జన్మదినం సందర్భంగా గురువారం తణుకు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కొట్టు నాగేంద్ర కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు మిఠాయిలు అందజేశారు. ఇటీవలే పార్టీ రాష్ట్ర పదవి పొందిన కొట్టు నాగేంద్రను పార్టీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వద్దూరి సీతారాం, వెలగల సాయిబాబారెడ్డి, యిండుగపల్లి బలరామకృష్ణ, జల్లూరి జగదీష్, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, పెనుమర్తి వెంకటరామన్న, ఉండవల్లి జానకి, మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, సత్తా కృష్ణవేణి, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, గెద్దాడ శ్రీకాంత్, ముళ్లపూడి బాబూరావు, పైడి సాయి సూర్య, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

**అత్తిలి:** మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ కారుమూరి సునీల్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పుట్టిన రోజు కేకును కట్‌చేసి, కారుమూరి నాగేశ్వరరావు, సునీల్ కుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు హాజరై మాట్లాడారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, భీమవరం ఎంపీపీ పేరిచర్ల వెంకట నరసింహ రాజు, మండల పార్టీనాయకులు పోలినాటి చంద్రరావు, కంకటాల సతీష్, బుడితి సుజన్‌కుమార్, రంభ సూరిబాబు, సబ్బితి రాజేష్, కోరుకొల్లు వెంకట్రావు, దిరిశాల నాగబాబు, కునాధరాజు శ్రీహరిరాజు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు



దుర్గమ్మను ఊరేగిస్తున్న దృశ్యం



ఊరేగింపులో విచిత్ర వేషధారణలు

**పెంటపాడు:** మండలంలోని పలు గ్రామాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురు, శుక్రవారాల్లో ఘనంగా ముగిసాయి. అమ్మవార్లకు ఊరేగింపు కార్యక్రమాలు, ప్రత్యేకపూజలు, నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆకుతీగపాడు గ్రామంలో దుర్గమ్మ ఉత్సవాలు ముగింపు పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ నాయకులు వీరాబత్తుల నాగ సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు మేళతాళాలతో ఊరేగించారు. ప్రత్తిపాడు దుర్గమ్మ ఆలయంలో గురువారం విజయదశమి పురస్కరించుకొని అమ్మవారికి పాలాభిషేకం చేశారు. శుక్రవారం ఏకాహంజరిగింది. రాత్రి అమ్మవారిని ఊరేగింపు అనంతరం ఏలూరు కాలువలో తెపోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. కె. పెంటపాడు బైరాగిమఠంలో ప్రతిష్టించిన అమ్మవారిని ఈవో చంద్రశేఖర్, అర్చకులు త్రిలోచన దాసుల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రత్తిపాడు వై. జంక్షన్ అమ్మవారి ఆలయంలో ఈవో జవ్వాది కృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు.

# ఆదర్శనీయుడు మహాత్మా గాంధీ



తణుకులో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



పెంటపాడు మోడల్‌స్కూల్లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**తణుకు అర్బన్:** అహింసావాదంతో భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టిన మహాత్మా గాంధీజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. గురువారం గాంధీజీ జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులపై ఆంగ్లేయుల ఉక్కుపాదాన్ని అణచివేసే విధంగా శాంతియుత పోరాటం చేసిన మహనీయుడిని నిత్యం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజల్లో ఉద్యమాన్ని రగిలింపచేసి ఆంగ్లేయుల గుండెల్లో భయం చూపిన గాంధీజీ చిరస్మరణీయుడని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని గాంధీజీ విగ్రహానికి పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వద్దూరి సీతారాం, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు, ఎస్‌పీ జాకబ్‌బాబు, పైడి సాయిసూర్య, నాసరి పార్థసారథి, షేక్ జిలానీ, పొడుగు రామాచారి, కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు. పైడిపర్రు తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కంబాల రంగారావు, పీడీజీ లైన్ మాదిరెడ్డి బాబూజీ రావు, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ కుంకట్ల వెంకట రత్నం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

**మహనీయుల అడుగుజాడల్లో నడవాలి**

**తాడేపల్లిగూడెం:** మహనీయుల అడుగుజాడల్లో నడవడమే వారికి అర్పించే నిజమైన నివాళని గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా బుధవారం నిట్‌లో జరిగిన కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులను ఎదిరించి, వారి వెన్నులో వణుకు పుట్టించిన మహనీయుల కృషి వెలకట్టలేనిదన్నారు. భారతి జాతి నిర్మాణంలో, స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర చిర స్మరణీయమన్నారు. స్వాతంత్ర్య ఫలాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విభిన్న ఆలోచనలతో కొత్త కొత్త ఆవిష్కరణలతో ప్రపంచ యవనికపై భారత్ ఖ్యాతిని ఇనుమడింప చేయాలని కోరారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ, రవికిరణ్ శాస్త్రి, ఆచార్యులు రాముడు , కిషోర్ తదితరులు పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అహింసామార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించడానికి కృషి చేసిన జాతిపతి మహాత్మాగాంధీ ఆశయాలు అందరికి స్ఫూర్తి కావాలని ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడా రు. గాంధీ జీవిత చరిత్ర అందరికి అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ సూర్యకుమారి పాల్గొన్నారు.

**గాంధీజీ, శాస్త్రి స్ఫూర్తితో ముందుకు సాగాలి**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** దేశంకోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గాంధీ జయంతిని నిర్వహించారు. గ్రంథాలయాధి కారి వానపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జేవీవీ నాయకులు పత్తి వీరాస్వామి, సీనియర్ అధ్యాపకులు సత్య ప్రకా ష్, వి.జాన్‌బాబు, బాబూజీ. చదవరులు పాల్గొన్నారు.

**గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి**

**పెంటపాడు:** గాంధీజీ ఆశయాల సాధన దిశగా ప్రతిఒక్కరూ ముందుకు వెళ్లాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రెడ్డి సూరిబాబు తెలిపారు. పెంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పలు పాఠశాల్లో ఆయా హెచ్‌ఎంలు, నిర్వాహకుల ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, హెచ్‌ఎం పెద్దిరాజు పాల్గొన్నారు.



నిట్‌లో గాంధీ జయంతి



ఉద్యానవర్సిటీలో గాంధీ జయంతి

# కొమరవరం గ్రామ అధ్యక్షుడిగా సలాది



కొమరవరంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులతో సర్పంచ్ రాజేష్

**తణుకు అర్బన్:** పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాలకు తగ్గట్లుగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని గ్రామ సర్పంచ్ కరిబండి రాజేష్, సొసైటి మాజీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు పేర్కొన్నారు. తణుకు మండలం కొమరవరం గ్రామంలో నూతనంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా సలాది హరి కిషోర్‌నాయుడు, అనుబంధ విభాగాల అధ్యక్షులను శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నిర్వహించే ప్రతి కార్యక్రమానికి అండగా నిలబడాలని కోరారు. పార్టీ ఉపాధ్యక్షుడిగా భావన దొరబాబు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, యువజన విభాగ అధ్యక్షులుగా గంటా పవన్, రైతు విభాగం అధ్యక్షుడిగా బొరుసు ఈశ్వరరావు నూతనంగా ఎన్నికైనట్లు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు మద్దింశెట్టి ఏడుకొండలు, అన్నెం సూర్యారావు, గంటా నాగరాజు, గోళ్ళ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మలేరియా అసిస్టెంట్ అధికారి యు.నాగబాబు, సబ్‌యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని యాగర్లపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 25వ వార్డులో డ్రై డే కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు జరిగాయి. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి వార్డులోను నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. వ్యర్థాలను ప్రజలు తప్పక పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. జ్వరాలు వస్తే సమీపం ఆరోగ్య హెల్త్ సెంటర్‌లు వద్ద, ఏరియా ఆసుపత్రిలోని వైద్య పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ కాంతారావు, ప్రసాద్‌బాబు, ఎ.ఎన్.ఎంలు జ్యోతి, వెంకట లక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

# యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నక్కెళ్ళ కృష్ణ ప్రసాద్ (తాతాజీ)

**తాడేపల్లిగూడెం అర్బన్ :** తాడేపల్లిగూడెం పట్టణ యాదవ అభ్యుదయ సేవా సంఘం స్థానిక 8వార్డులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని నియమించారు. పట్టణ అధ్యక్షుడిగా నక్కెళ్ళ కృష్ణ ప్రసాద్ (తాతాజీ) యాదవ్, కార్యదర్శిగా తలగాని రామకృష్ణ యాదవ్, ఉపాధ్యక్షుడిగా బండి బలుసులు యాదవ్, ఈగల తాతారావు యాదవ్, సారిపల్లి రమణ యాదవ్, గొబ్బిళ్ళ శ్రీనివాస యాదవ్, బియ్యపు అప్పలనాయుడు యాదవ్, కుండల సత్యనారాయణ యాదవ్ నిర్వాహక సభ్యులుగా, కోశాధికారిగా ఇసరపు శ్రీనివాస యాదవ్‌లు నియమితులయ్యారు. వంకా కామేశ్వరరావు యాదవ్, కిల్లాడి ప్రసాద్‌యాదవ్, పట్నాల రాంపండు యాదవ్, బొద్దాని శ్రీనివాస యాదవ్, కాళ్ళ గోపికృష్ణ యాదవ్, వీర్ల సత్యనారాయణ యాదవ్, నీలపాల దినేష్ యాదవ్, గొర్ల మహారాజు యాదవ్ ఆధ్వర్యం వహించారు.

# ప్రత్తిపాడు శివాలయానికి విరాళాలు



ప్రత్తిపాడులో సదాశివస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

**పెంటపాడు:** మండలలోని ప్రత్తిపాడు ఏలూరు కాలువ గట్టు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రతిమాంబ సమేత సదాశివస్వామి ఆలయ నిర్మాణం కార్యక్రమంలో భాగంగా దసరా పురస్కరించుకొని దాతలు విరాళాలు అందజేశారు. కాగులంపాడుకు చెందిన స్వర్గీయ పుట్టా వెంకట్రాజు, లక్ష్మినారాయణమ్మల కుమార్తె, అల్లుడు అయిన మద్దుకూరి కమల, వేణుగోపాల కృష్ణ (యుఎస్ఏ)లు ఆలయంలో విఘ్నేశ్వరస్వామి, ఇతర ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు రూ.15లక్షలను గురువారం కమిటీ అధ్యక్షుడు వీర్ల కృష్ణ, సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలిపారు. మిత్తిరెడ్డి అమర్‌కుమార్ రూ. 1లక్ష, తాడిపర్తి నాగవెంకట ధనరాజు రూ.1 లక్ష, వీర్ల అనిల్, సునిల్‌లు రూ. 25 వేలు, ముదునూరుకు చెందిన అడ్డగర్ల త్రిమూర్తులు రూ. 20 వేలు, మరో భక్తుడు రూ.12 వేలను విరాళంగా అందజేశారు.

# కొట్టు నాగేంద్రకు అభినందనలు



కొట్టు నాగేంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం యూత్ సభ్యులు

**తాడేపల్లిగూడెం అర్బన్ :** వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన కొట్టు నాగేంద్రకు తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసంలో గురువారం ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు తనవంతుగా అహర్నిశలు కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి శ్రమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.నాగరాజు, కె.భాస్కరాచార్యులు, బి.శ్రీనివాస్, వి.బుజ్జి, పి.శివ తదితరులు ఉన్నారు.

### కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న మంగరాజు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వెదురుకుప్పం మండలం దేవళంపేట సర్కిల్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను అంబేద్కర్ విగ్రహాలపై రోజూ ఏదొక చోట అవమానాలు జరుగుతూ ఉన్నాయని, పాలకులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ దళితుడు కావడం వల్లే రోజూ విగ్రహాలను అవమానం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాజారావు, గోపి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** స్థానిక నార్త్ సెక్షన్ పరిధిలో హౌసింగ్‌బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 4వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఎస్‌వీఆర్ సర్కిల్ నుంచి గణేష్ నగర్ రోడ్డు వరకు అదనపు పోల్స్ ఏర్పాటునిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు.